ఎస్సీ, ఎస్టీ నూతన క్యాలెండర్ విడుదల

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం(140/2018) 2025 నూతన క్యాలెండర్‌ను శనివారం జీఎం కార్యాలయంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ లైసెన్ అధికారి కిరణ్ కుమార్, శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేగల ప్రవీణ్ కుమార్, శాఖ కార్యదర్శి రెడపాక లక్ష్మణ్, కోశాధికారి గోదారి మురళి, సలహాదారులు గునిగంటి నర్సింగరావు, యుగేందర్ సాయి, సుందిళ్ల నరేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ ఆదిలాబాద్

1

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా ప్రజాసేవ ఆటో యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు కుమ్మరి రాజ్కుమార్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా సిద్ధమల్ల ప్రసాద్, గోవిందుల సమ్మయ్య, ఉపాధ్యక్షుడు నున్సవత్ చిరంజీవి నాయక్, ప్రధాన కార్యదర్శి రొడ్డ సమ్మయ్య, కోశాధికారి కుశనపల్లి సతీష్, ప్రచార కార్యదర్శులు అజ్మీర్ రాజేష్ నాయక్, కొలిపాక సతీష్ ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా రాజకుమార్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నిక కాబడిన నాయకులు ఆటో డ్రైవర్ల సమస్యలకై కృషి చేయాలన్నారు.



ప్రజాభిష్టం మేరకు అభివృద్ధి

● ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యే

నవతెలంగాణ-జైపూర్



నియోకవర్గం ప్రజల అభిష్టం మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. భీమారం మండలంలోని ఎల్బీపేట్ గ్రామంలో రూ.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఎన్నికలకు ముందు గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గం ప్రజలకు ఆకాంక్షకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మడే మహేష్‌ను పరామర్శించారు. అనంతరం మద్దికల్ శివారులో వరి నాట్లు వేస్తున్న మహిళలను కలిసి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా..? అని అడిగి తెల్సుకున్నారు. మహిళల శ్రేయస్సు కోరి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందనున్నాయని తెలిపారు.

క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

దేశ వ్యాప్తంగా క్రికెట్ క్రేజ్ ఎక్కువగా కన్పిస్తుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. జైపూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలను ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. మండల స్థాయిలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. హెచ్‌సీఏ ప్రసిడెంట్‌గా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్సహించడం జరిగిందని అన్నారు.

సాగులో లేని బీడు భూముల గుర్తింపు

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ గురువారం మండలంలోని నీలాయపల్లి శివారులోని వెంచర్లను పరిశీలించారు. సాగులో లేని వ్యవసాయతర పట్ట భూముల గుర్తింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో గల శివారు ప్రాంతాలలో సాగులో లేని పట్టా భూములను వ్యవసాయ యోగ్యంగా భూములను వెంచర్లు వ్యాపార పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తున్న భూములను గుర్తించాలని తెలిపారు. సాగులో లేని శిఖం పట్ట భూములకు భారీ నిర్మాణ స్థలాలకు రైతు భరోసా వర్తించదని తెలిపారు. గుర్తించిన భూములు ఎందుకు ఎప్పటి నుండి వ్యవసాయతర భూములుగా మార్పు చెందాయన్న విషయాన్ని రైతుల వివరణ కోరాలని తెలిపారు. ఈ క్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ అంజన్ కుమార్, ఏజాజజోద్దీన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మందమర్రి



శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులందరూ ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిర పడి ఇన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి స్మృతులను, మధురానుభూతులను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదివిన మాకు విద్యతో పాటుగా సంస్కారం కూడా నేర్పించిందని అన్నారు. మిత్రులందరిని కలవడంతో తిరిగి బాల్యంలోకి వెళ్లినట్లు అనిపిస్తుందని, ఆనాటి బడి జ్ఞాపకాలను గుర్తు చేసి మనస్సుకు హాయి నింపడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి డి గోవింద రావు, అకాడమిక్ ఇన్‌చార్జి పూదరి సత్యనారాయణ, జిల్లా సహ కార్యదర్శి సూరం లక్ష్మీనారాయణ, పాఠశాల కార్యదర్శి దాసరి రాములు, పాఠశాల ప్రధాన ఆచార్యులు కట్ట శిరీష, కోశాధికారి డి సారయ్య, పూర్వ ఆచార్యులు సారంగపాణి, వై సత్యనారాయణ, పద్మావతి, రామకోటేశ్వరి, శారద, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

29 నుంచి పాహుండి

కుపర్ లింగు స్వామి జాతర

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కుర్రేఘడ్ గ్రామంలో ఆదివాసీ ఆరాధ్య దైవం కుర్రేఘడ్‌లోని పాహుండి కుపర్ లింగు స్వామి జాతర ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించేందుకు పాహుండి కుపర్ లింగు స్వామి ఆలయ కమిటీ తీర్మాణం చేసింది. ఆదివారం పాహుండి కుపర్ లింగు స్వామి జాతక నిర్వాహకులు గురి స్వామి కుర్సింగ భూదేశావ్ స్వామి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించి నిర్ణయించి, సంబంధిత జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గొండ్వాన గోండ్ జాతీయ నాయకులు సిడం అర్జు మాస్టర్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఆడే కృష్ణరావ్, ఉపాధ్యక్షుడు మెస్రం మధు, సురేందర్, రాము, రాజశేఖర్, తిరుపతి, మనోజ్, వినోద్, రంజిత్, జీవన్, మాజీ సర్పంచ్ ఆడె శంకర్, వల్క శ్రీను, ఆడే జంగు, కుంరం భీంరావ్, పెంద్రం శ్రీనివాస్, కుడ్మెత సోము, సోయం జంగు, మడవి హన్మంతు, మడావి వెంకటేష్, ఆత్రం అమృత్ రావ్, కుర్సెంగ హనుమంతు, సిడం గణపతి, మెస్రం రంజిత్, సెడ్మెకి రాధ, పెంద్రం ప్రభాకర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నవతెలంగాణ-నిర్మల్ టౌన్

జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయం వద్ద నిర్మల్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణవర్మ, కోశాధికారిగా గంగాధర్, కోశాధికారిగా దొంతుల గంగాధర్, గౌరవఅధ్యక్షులుగా ఒడ్నాల రమేశ్, జాయింట్ సెకరేట్రగా సంతోష్, సహ కోశాధికారిగా తౌటు హరిన్, సలహా సభ్యులుగా రఘునాథ్, ఆమెడా శ్రీను, ఉత్తూరు సంతోష్, చింతపండు సుధాకర్ ఎన్నికయ్యారు.

నామినేటెడ్ పోస్టులపై ఆశలు..!

● ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న పలు పదవులు ● ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశావహుల ఎదురుచూపులు
● అధిష్టానం పెద్దలు..ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు ● సంక్రాంతి పండగ ముగియడంతో అందరిలో ఆసక్తి

అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు..కార్యకర్తలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీకి సమయం ఆసన్నమైంది. సంక్రాంతి పండగ తర్వాత ఈ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొనడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఆశావహుల్లో నిరుత్సాహం కనిపిస్తోంది. తాజాగా ఇటీవల ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన మంత్రి ఈ పోస్టుల భర్తీ విషయం వెల్లడించడం.. పండగ సైతం ముగిసిపోవడంతో త్వరలోనే ప్రభుత్వం నుంచి తీపి కబురు వస్తుందనే ఆశతో ఉన్నారు. ఇప్పటికే ఈ పదవులను దక్కించుకొనేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక మంది నాయకులు ప్రభుత్వ పెద్దలు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఇంఛార్జీలను సైతం ప్రసన్నం చేసుకుంటూ పదవులు వచ్చేలా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా త్వరలోనే స్థానిక సంస్థలు ఉండటంతో వీటి తర్వాత భర్తీ ఉంటుందా..? అంతకుముందే కేటాయిస్తారా అనే సందిగ్ధం నెలకొంది.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. ఉమ్మడి జిల్లాలో నాలుగు ఎమ్మెల్యే స్థానాల్లో విజయం సాధించింది. మిగితా ఆరు స్థానాల్లో రెండు బీఆర్ఎస్, నాలుగింటిలో బీజేపీ గెలిచింది. కానీ ఎన్నికల అనంతరం పలువురు ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు అధికార పార్టీలో చేరడంతో ప్రస్తుతం బలమైన పార్టీగా మారింది. ఇక ప్రభుత్వం కీలకమైన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. పార్టీ కోసం అనేక ఏండ్లుగా కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు వీటిపై గంపెడాశలు పెట్టుకున్నారు. గత పదేండ్ల కాలంలో ప్రతిపక్షంలో ఉంటూ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులతో కలిసి సర్వశక్తులు ఒడ్డారు. ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవులను భర్తీ చేయగా.. ఉమ్మడి జిల్లాలో దండేపల్లి మండలానికి చెందిన కోట్నాక్ తిరుపతికి గిరిజన కార్పొరేషన్ ఛైర్మెన్ పదవి లభించింది. మిగితా ఎవరికి రాష్ట్ర స్థాయిలో పదవులు దక్కలేదు. కానీ జిల్లాల వారీగా కీలకమైన పదవులు ఉండటంతో వీటిని దక్కించుకునేందుకు అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇంఛార్జీలకు దగ్గరగా ఉంటున్న పలువురు నాయకులు వీటిని దక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. తరుచూ ఎమ్మెల్యేలను కలవడంతో పాటు మంత్రి సీతక్క, ఇతర ప్రభుత్వ పెద్దలను కలుస్తూ పదవిని కేటాయించాలని కోరుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రభుత్వ నిర్ణయంపై ఆసక్తి..!

ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తుండటంతో ఎవరికి దక్కుతుందా..అని అందరిలో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఒకటి, రెండు చోట్ల మినహా అన్నింటిలో మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించగా..జిల్లాల్లో కీలకమైన గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్, ఐసీడీఎస్ ప్రాంతీయ సమన్వయకర్త, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్‌కమిటీలు, ఐటీడీఏ సలహా మండలి ఛైర్మెన్ తదితర పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుంది. వీటిని దక్కించుకునేందుకు అనేక మంది ఆరాటపడుతున్నారు. తరుచూ సర్కారు పెద్దలను కలుస్తూ తమ సేవలను గుర్తించాలని కోరుతున్నారు. మరోపక్క సంక్రాంతి తర్వాత పదవుల భర్తీ ఉంటుందని చెబుతున్నా..త్వరలోనే స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ పదవుల భర్తీ ఇప్పుడే ఉంటుందా ఉండదా అనేది స్పష్టతరావడం లేదు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు మారిపోయే అవకాశం ఉండటం..జడ్పీ ఛైర్మెన్ వంటి కీలకమైన పదవులు రిజర్వేషన్ల ప్రకారం భర్తీ అవుతాయి. దీంతో వీటికి వచ్చే రిజర్వేషన్ ప్రకారం ఏదేని ఒక సామాజికవర్గం ఈ పోస్టుల్లో భర్తీ అవుతారు. దీంతో ఇతర ఇతర సామాజిక వర్గాల వారికి నామినేటెడ్ పోస్టులు కేటాయించేందుకు మార్గం సుగుమవుతుందనే ప్రచారం జరుగుతోంది. దీంతో సంక్రాంతి పండగ ముగిసినా.. ఎన్నికల తర్వాతే ఈ పదవుల భర్తీ ఉంటుందనే ప్రచారం జోరుగా సాగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం ఎన్నికల తర్వాత ఈ పోస్టులను భర్తీ చేస్తుందా..ఎన్నికల కంటే ముందుగానే కేటాయిస్తుందా అని సందిగ్ధంగా మారగా.. ప్రభుత్వ నిర్ణయం కోసం అనేక మంది ఆశావహులు ఆతృతగా ఎదురుచూస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం సింగరేణి కార్మికుల కాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనతో మాట్లాడుతూ మురుగు కాలువ పైకి ఉండడం వలన వర్షాకాలంలో వర్షపు నీరు ఇంటి లోపలికి వస్తున్నాయని తెలిపారు. వర్షాకాలంలో క్వార్టర్లు ఉరుస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా కాలనీలోకి వచ్చే మంచినీరు పరిశుభ్రంగా ఉండడం లేదని, దీంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఇంటిలో కార్మికుడు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థలో పనిచేయగలరని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కార్మిక నివాస కాలనీలలో కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మిక కాలనీలను పట్టించుకోవడంలేదని, మున్సిపాలిటీలకు పన్నులు కడుతున్న మున్సిపాలిటీ వారు సైతం పట్టించుకోవడంలేదని అన్నారు. గతంలో కార్మిక కాలనీలను అధికారులు సందర్శించే వారని, రాను రాను ఆనవాయితీ మర్చి పోతున్నారని విమర్శించారు. క్వార్టర్లో ఉండడం వల్ల ఆదాయపన్ను ఎక్కువ పడుతున్నదని సీఐటీయూ సొంతింటి కల పథకమును నెరవేర్చే దిశగా ఎవరి క్వార్టర్ వారికే ఇవ్వాలని అన్నారు. క్వార్టర్ లేని కార్మికులకు 250 గజాల స్థలం ఇవ్వాలని పోరాడుతున్నదని దీనిలో భాగంగానే కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వడం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. గెలిచిన సంఘం సీఎండితో జరిగే స్ట్రక్చర్ మీటింగ్లో ఈ సమస్యను మాట్లాడి యాజమాన్యాన్ని ఒప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, మిడివెల్లి శ్రీనివాస్, ఆర్జీ-1 కార్యదర్శి ఆరేపల్లి రాజమౌళి, నరహరి, ఖాదర్ పాషా, రాజగోపాల్, సదానందం, తోడే సుధాకర్, సాయిళ్ళ శ్రీనివాస్, చిగురు లక్ష్మణ్, బంద్ శ్రీను, నరేష్, వెంకటరెడ్డి, శ్రీపతి బానేష్, నరేష్ పాల్గొన్నారు.

కులగణన చేపట్టి చట్టసభల్లో బీసీలకు వాటా ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్

కులగణన చేపట్టి దాని ప్రకారమే చట్టసభల్లో వాటా ఇవ్వాలని సింగరేణి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు. ఆదివారం ఎస్సీఓఏ క్లబ్‌లో బీసీ ప్రథమ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాక్టింగ్ బేస్డ్ ప్రమోషన్లలో రోస్టర్ విధానం ప్రకారం రిజర్వేషన్, అధికారుల ప్రమోషన్ విధానంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు జరగాలన్నారు. జ్యోతిరావు పూలే జన్మదినం యాజమాన్యం అధికారికంగా నిర్వహించి సింగరేణి ఉద్యోగులకు పీహెచ్డీ కల్పించి పూలే మహనీయుని గౌరవించాలని, జనాభా ప్రాతిపదికన దామాషా పద్ధతిలో 60 శాతం రిజర్వేషన్ ఆర్థికంగా, సామాజికంగా, సాంఘికంగా, రాజకీయంగా చట్టసభలలో బిల్లు పెట్టి ఆమోదించాలన్నారు. విధిగా సింగరేణి యాజమాన్యం 11 ఏరియాలకు లైజనింగ్ అధికారితో పాటు కార్యాలయ వసతి కల్పించాలని, ప్రతి జీఎం కార్యాలయంలో జ్యోతిరావుపూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని, జ్యోతిరావు పూలేకి భారతరత్న ఇవ్వాలన్నారు. ప్రతి మీటింగ్‌లో బీసీ వెల్ఫేర్ నాయకత్వాన్ని విధిగా యాజమాన్యం అధికారికంగా పిలువాలని, ఈ డబ్ల్యూ ఎస్‌ను రద్దు చేయాలని, శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంను జ్యోతిరావు పూలే స్టేడియంగా మార్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్కె సమ్మయ్య, పేరం రమేష్, పెట్టం లక్ష్మణ్, నాగేశ్వరరావు, చిలక శ్రీనివాస్, పి హరి శంకర్‌రావు, షేక్ బాజీసైదా, జెట్టి శంకరరావు, అధికారులు ఎస్ సత్యనారాయణ, పి అరవింద రావు, కే రాజేందర్, కిరణ్ కుమార్, ఎస్ రాజేశ్వరరావు, ఏరియా నాయకులు బారుపాటి మారుతి, బద్రి బుచ్చయ్య పాల్గొన్నారు.



యువత చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

నవతెలంగాణ-కాసిపేట



యువత చదువుతో పాటు ఆటల్లో రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని మందమర్రి సీఐ శశిదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో కొనసాగుతున్న కేఎంపీఎల్ సీజన్ త్రీ క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై బ్యాటింగ్ చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమ మాట్లాడుతూ క్రీడాకారులందరు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి ఆటలను విజయవంతం చేయాలన్నారు. అలాగే నేటి యువత నిషేధిత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. నిషేధిత మత్తు పదర్థాలు లేని సమాజ నిర్మాణంలో అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచాచారు. ఇంత భారీ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమములో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్ఓ ప్రవీణ్ నాయక్, నిర్వాహకులు మేరుగు శ్రీనివాస్, దాసరి శంకర్, నామాసాని రాజు, కంటం తిరుపతి, పది ప్రాంచైజ్ యజమానులు, క్రీడాకారులు పాల్గొన్నారు. 15 రోజుల పాటు జరగే ఈ టోర్నీలో మ్మొదటి బహుమతి రూ.50 వేల నగదుతో పాటు ట్రోపి, రెండవ బహుమతి రూ.30 వేల నగదు ట్రోపి ఇవ్వనున్నట్లు నిర్వాకులు తెలిపారు.

క్రికెట్ పోటీల్లో బ్లూస్టార్ విజయం

నవతెలంగాణ-తాండూర్

బోయపల్లిలో నిర్వహించిన 5 గ్రామా క్రికెట్ పోటీల్లో విజేతగా జట్టుగా బర్లగూడెం బ్లూ స్టార్ జట్టు విజయం సాధించింది. రన్నర్‌గా గొండగూడెం జట్టు నిలిచింది. టోర్నమెంట్‌లో ఐదు గ్రామాలకు చెందిన 8 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.5016 రూ.3016 నిర్వాహకులు మాసాది శశివర్ధన్ బహుమతి పంపిణీ కార్యక్రమంలో తుపాకుల రాంబాబు, మాసాడి విజయ్ కుమార్, నల్లుల క్రాంతి, మాసాడి సాయి, మాజీ ఉపసర్పంచ్ మాసాడి తిరుపతి పాల్గొన్నారు.

ఎంసీసీ క్రికెట్ పోటీల్లో మాదారం జట్టు విజయం

మాదారం లాల్ బహుదూర్ స్టేడియంలో మాదారం క్రికెట్ క్లబ్ పోటీల్లో మాదారం జట్టు విజయం సాధించి రూ.2 వేల నగదు బహుమతి గెలుచుకుంది. పది రోజులు గా కొనసాగిన ఈ పోటీల్లో మొత్తం 28 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో మాదారం వర్సెస్ ఐబీ-11 జట్లు తలపడ్డాయి. మాదారం ఎంసీసీ విన్నర్‌గా నిలువగా రన్నర్‌గా ఐబీ-11 జట్టు విజయం సాధించింది. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ ఇరుజట్లకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ ప్రెసిడెంట్ పుట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఉట్నూర్



నార్నూర్ మండలం మాలంగి ఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని కాంగ్రెస్ పార్లమెంటరీ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ పరామర్శించారు. ఉట్నూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 11 మందిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, తీవ్ర గాయాలైన వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించాలని వైద్యులకు సూచించారు. గాయాలైన వారు ఎలాంటి ఆందోళన చెందవద్దని అందరికీ మెరుగైన వైద్యం అందిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. ఆమె వెంట జంగుబాయి సంస్థాన్ ఛైర్మన్ సలాం శ్యామ్‌రావు, కాంగ్రెస్ నాయకులు మర్సకోల తిరుపతి, నగేష్ ఉన్నారు.

నార్నూర్ : మండలంలోని కొత్తపెల్లి-హెచ్ మాలేపూర్ మల్కగూడ వద్ద ఆదివారం ఐచర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. విషయం తెలుకున్న మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ తొడసం నాగోరావ్, ఆదివాసీ జిల్లా నాయకులు పెందూర్ దీపక్ ఆస్పత్రిలో బాధితులకు పరామర్శించి పండ్లు పంపిణీ చేశారు.

సమ్మె విజయవంతం చేసిన కార్మికులకు అభినందనలు

నవతెలంగాణ-జైపూర్



హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన టోకెన్ సమ్మెలో పాల్గొని విజయవంతం చేసిన కాంట్రాక్టు కార్మికులకు అభినందనలు తెలుపుతున్నామని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ఎస్టీపీపీలో గల వివిధ విభాగాలకు చెందిన 1040 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎస్టీపీపీ యాజమాన్యం కండ్లు తెరువాలని, కార్మికుల సమస్యల పరిష్కారం వైపు దృష్టి సారించాలని అన్నారు. కార్మికులు చేపట్టిన సమ్మె విజయవంతం అయినప్పటికీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న యాజమాన్యం సమ్మెతో సమ్మె ప్రభావం శూన్యమని ప్రకటించుకోవడం సిగ్గు చేటని అన్నారు. యాజమాన్యంలో మార్పు కోరుకుంటున్నామని తెలిపిన ఆయన నిర్లక్ష్యం ప్రదర్శిస్తే నిరవధిక సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ అనుబంధ ఎస్టీపీపీ కార్మిక సంఘం నాయకులు విక్రమ్, సాయి కృష్ణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, చిప్పకుర్తి సంపత్, నవీన్ చారీ, సంతోష్, సత్యనారాయణ చారి పాల్గొన్నారు.

చట్ల ఉమేష్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-బోథ్



చెట్ల ఉమేష్ సేవలు అభినందనీయమని ఎంఈఓ కుమ్మరి పోశెట్టి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెట్ల ఉమేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా 15 ఏండ్లుగా ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, సొసైటి డైరెక్టర్ చట్ల ఉమేష్ సేవలను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్‌టీవీ ప్రసాద్, అప్పాల శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, అమరేందర్, హన్మాండ్లు, శంకర్, గంగారాం, పడిగెల విజయకుమార్, లక్ష్మణ్, గంగయ్య, సాగర్, రమేష్, బ్రహ్మానందం, రఘుపతి, విశ్రాంత ఉపాధ్యాయులు సురేష్ వైద్య, మురళిధర్, జి.శంకర్, గణపతి, రాజేశ్వర్ రెడ్డి, సదానందం, దివాకర్ రెడ్డి, మోహినొద్దీన్, నరేందర్, శంకర్, శివయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-బోథ్



మండలంలోని పొచ్చార గ్రామానికి చెందిన కలిగేటీ సంటన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్యే అనీల్ జాదవ్ బాదిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకోని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు తుల శ్రీనివాస్, నారాయణ్ రెడ్డి, సురేందర్ యాదవ్, సదానందం, సుధీర్ రెడ్డి, ప్రశాంత్, డాక్టర్ స్వామి, రాజన్న, జక్క శ్రీధర్ రెడ్డి, దివాకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐసీఐసీఐ బ్యాంక్ అధికారుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న బేలకు చెందిన జాదవ్ దేవ్ రావ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ అన్నారు. రైతు ఆత్మహత్యకు కారణమైన బ్యాంకు అధికారులపై తక్షణమే చట్టరిత్య చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబెడ్కర్ భవనంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆ రైతు రుణాన్ని పూర్తిగా మాఫీ చేయాలని ఆ రైతు కుటుంబంలో ఒకరికి అదే బ్యాంకులో ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ కోలం సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావు, జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నక్క రాందాస్, లక్ష్మణ్, చందు పాల్గొన్నారు.

కేథేశ్వర స్వామికి జీసీసీ ఛైర్మన్ పూజలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ఫోన్ కాల్ గ్రామపంచాయతీ పరిధిలోని శివారులోని శ్రీ కేతేశ్వర స్వామి కాంకాలమ్మ దేవాలయంలో జీసీసీ రాష్ట్ర ఛైర్మన్ కొట్నాక తిరుపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా ఆదివారం ఆయన శ్రీ కేతేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.

పూసాయి జాతరకు పోటెత్తిన జనం

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పూసాయి గ్రామంలో ప్రతి సంవత్సరం పుష్య మాసంలో నెల రోజుల పాటు ఎల్లమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తారు. ఎప్పటిలాగే ఈ ఆదివారం వందల సంఖ్యలో జనం పోటేత్తారు. ఈ జాతరకు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర వాసులు అధిక సంఖ్యలో వచ్చి ఎల్లమ్మను దర్శించుకుంటున్నారు. అదేవిధంగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని పెనుగంగా నది తీరాన గంగా జాతరను, అక్కడి తీర ప్రాంత ప్రజలు జాతరను ఘనంగా నిర్వహిస్తారు.



మాజీ ఎమ్మెల్యేను కలిసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు

నవతెలంగాణ-లోకేశ్వరం

ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌ను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హర్షప్రసాద్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల శబరికి వెళ్లి వచ్చిన ఆయన భైంసా టౌన్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు శబరి నుంచి తీసుకువచ్చిన ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముధోల్ తాలూకా యూత్ అధ్యక్షులు షఫీ పాల్గొన్నారు.



బాలుడి హత్య కేసును చేదించిన పోలీసులు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

దిలావర్‌పూర్ మండలంలోని చిట్యాల గ్రామ శివారులో చింతల చెరువు వద్ద బండరాయితో మోదీ బాలుడిని చంపిన ఘటనను పోలీసులు 24 గంటల్లో చేదించారు. బాలుడి హత్య కేసులో అదే గ్రామానికి చెందిన తోకల రాజేశ్వర్ హోమోసెక్స్ అలవాటు కలదని, కామవాంఛ తీర్చుకోవటం ఈ నెల 17న అర్ధరాత్రి సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా తెలుస్తుందని భయపడి మద్యం మత్తులో ఉన్న ఆయన బాలుడిని అతి కిరాతకంగా బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఏఎస్పీ రాజేష్ మీనా నేతృత్వంలోని టీమ్, జిల్లా డాగ్ స్క్వాడ్, క్రైం టీమ్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తుడిని గుర్తించి, హత్య జరిగిన కొద్ది గంటల్లోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో సూచనలు, సలహాలు అందించిన అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏఎస్పీ రాజేష్ మీనా, సీఐ. రామకృష్ణ, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ కృష్ణ, ఎస్సై లింబాద్రి, సందీప్, సాయికిరణ్, డాగ్‌స్క్వాడ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అభినందించారు.

27న చలో ఐటీడీఏ కరపత్రాల విడుదల



నవతెలంగాణ-ఉట్నూర్

భూమి, ఇండ్ల స్థలాల సమస్యలపై ఈనెల 27న చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ అన్నారు. ఆదివారం మండలంలోని ప్రెస్ భవన్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీ తక్షణమే అమలు చేయాలన్నారు. రైతుబంధు ఎకరానికి రూ.15వేలు పెంచుతామని చేసిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలనీ అన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములకు పట్టాలు ఇచ్చి, వారికి భద్రత కల్పించాలని కోరారు. అర్హులైన పేద ప్రజలకు ఇండ్ల స్థలాలను ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ చేసిన వాగ్దానాలను అన్నింటిని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 27న ఐటీడీఏ కార్యక్రమానికి ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం నాయకులు రాథోడ్ రాహుల్, లక్ష్మణ్, జాదవ్ అర్జున్, సోనేరావ్, ఇంద్రాల శ్రీహరి, టెకం మోతిరాం, చవాన్ సురేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణానికి చెందిన మున్నూరుకాపు యువజన సంఘ సభ్యుడు కొప్పుల మురళి ఇటీవల అకాల మరణం చెందారు. ఈ మేరకు రూ.50 వేల చెక్కును సంఘం తరపున మృతుడి కుటుంబానికి అందజేశారు. యువజన సంఘం తరపున కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండ శ్రీధర్, ఆదుముల్ల పద్మాకర్, అధ్యక్షుడు రాకేష్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కొప్పుల సంజయ్, కొప్పుల రవి, జాప సందీప్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని కుమ్మరి కుంట, సోనాపూర్, సంబుగూడ, ఉట్నూర్ సంతలో ఆదివారం ప్రజలకు రోడ్డు భద్రతపై కళాజాత బృందం సభ్యులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోవింద్, శంకర్, ఆశిష్, నగేష్, రాజన్న పాల్గొన్నారు.

నిర్మల్ కవులకు జాతీయ పురస్కారాలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



నిర్మల్ కవులకు జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో శ్రీ గౌతమేశ్వర సాహితి కళా సేవా సంస్థ శ్రీ ఆర్యాణి సకల కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సంక్రాంతి ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. ఇందులో కవి రచయిత ప్రభుత్వ ఉపాధ్యాయులు అంబటి నారాయణకి సాహితీ రత్న నాలుగు దశాబ్దాలుగా సాహితీ సేవలతో పాటు సామాజిక సేవలు చేస్తున్న నేరెళ్ల హనుమంతుకు సాహితీ కిరణం పురాష్కారంతో సత్కరించారు. స్వర్ణ కంకణం, శాలువ, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి కవి రచయిత చిత్రకారుడు వ్యాఖ్యాత వ్యవస్థాపక అధ్యక్షులు గౌతమేశ్వర, ఆర్యని సకల కళ వేదిక గారు సభాధ్యక్షులుగా వ్యవరించారు. ఈ సందర్భంగా ఇంతకు నీవెవరు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవులు కళాకారులు అభిమానులు అభినందించారు.

సర్టిఫికెట్ ఇచ్చారు... పారితోషికం మరిచారు..!

- తొమ్మిది నెలలు గడుస్తున్న అందని రెమ్యునరేషన్
- ఆందోళనలో ఎన్నికల విధులు నిర్వర్తించిన అధికారులు



ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు (ఫైల్)

నవతెలంగాణ-లోకేశ్వరం

ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు వివిధ స్థాయిలో ఎన్నికల అధికారులుగా నియమించి, ప్రభుత్వం సర్టిఫికెట్లు అందజేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వారు ఎన్నికల విధులు నిర్వర్తించారు. కాని వారికి ఇప్పటి వరకు ఎన్నికల విధులకు సంబంధించిన పారితోషికం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారితోషికం చెల్లించాలని కోరుతున్నారు. అందులో భాగంగానే ముధోల్ నియోజకవర్గ పరిధిలో గతేడాది మే13న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో విధులు నిర్వర్తించారు. ఎన్నికల విధులు పూర్తయి తొమ్మిది నెలలు పూర్తవుతున్న ప్రభుత్వం ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన అధికారులకు పారితోషికం చెల్లించలేదు. వారు 16 మార్చి 2024 నుంచి 13మే వరకు 59 రోజుల పాటు విధుల్లో ఉన్నారు. ఎన్నికల్లో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఏఈఓలుగా విధుల్లో కొనసాగారు. పారతోషికం విషయమై పలుమార్లు ఉన్నతాధికారులను కలిసి సమస్యను విన్నవించిన అది అపరిష్కృతంగా ఉంటోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎన్నికల ఉన్నాతాధికారులు స్పందించి తమ రెమ్యునరేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు.

తొమ్మిది నెలలు అందని పారతోషికం...

ఎన్నికల విధులు నిర్వర్తించి తొమ్మిది నెలలు గడుస్తున్న ప్రభుత్వం ఇప్పటి వరకు తమ రెమ్యునరేషన్ చెల్లించలేదని పలువురు అధికారులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులను కలిసిన ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని వారు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 59రోజుల పాటు విధులు నిర్వర్తించామని, ఎన్నికలు ముగిసి తొమ్మిది నెలలు పూర్తవుతున్న ఇప్పటి వరకు రెమ్యునరేషన్ అందకపోవడం పట్ల అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్నా, గత ఎన్నికల్లోని విధులకు సంబంధించిన పారతోషికం ఇంకా రాలేదని, అవి వస్తే కొంత మేరకు ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది



ఎన్నికల సమయంలో అనేక కష్టాలను ఓర్చుకొని ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేశాం. బిల్లులను ఆర్థికశాఖకు పంపించామని, రాగానే చెల్లిస్తామని అధికారులు రోజులు గడుపుతున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

లక్ష్మణ్, ఉద్యోగి, మాటేగాం టోల్ ప్లాజా

తొమ్మిది నెలలైనా ఎలక్షన్ డబ్బులు ఇవ్వలేదు



పార్లమెంట్ ఎన్నికలు ముగిసి తొమ్మిది నెలలైనప్పటికి టీఏ, డీఏ అందలేదు. విధులు నిర్వర్తించిన అధికారులకు ఒక్కొకరికి రూ.10 వేల నుంచి రూ.25 వేలు టీఏ, డీఏ రావాల్సి ఉంది.

మంద చిన్నయ్య, అధ్యాపకుడు, లోకేశ్వరం

క్రీడల్లో గెలుపోటములు సహజం



నవతెలంగాణ-బోథ్

క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడల వరకే పోటాపోటీగా ఉంటూ తర్వాత అన్నదమ్ముల్లా కలిసి ఉండాలి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పొచ్చర గ్రామంలో క్రికెట్ కప్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై బహుమతులను అందించారు. మొదటి బహుమతి రూ.25,000, ద్వితీయ బహుమతి రూ.15,000 నగదును ఇచ్చి క్రీడా స్ఫూర్తిని చాటిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కేసీఆర్ సీఎం కప్ పేరుతో యువకులను ప్రోత్సహించిందని గుర్తుచేశారు. క్రీడాకారులు కేవలం క్రీడల్లోనే పోటాపోటీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు దివాకర్ రెడ్డి, రాజారెడ్డి, రమణ రెడ్డి, శమేందర్ రెడ్డి, చింటూ రెడ్డి, రాజు, ప్రవీణ్ రెడ్డి, శ్రవణ్, సురేందర్, సదానంద్, రూప్సుంద్ ఎలుక రాజు, ప్రశాంత్, డా.స్వామి, సుధీర్ రెడ్డి, రఫీ, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, మహేందర్ రెడ్డి, పాండురంగ్, గాడ్గే సుభాష్, రమేష్, మహిమూద్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-నార్నూర్

మూఢ నమ్మకాలు, చెడు వ్యసనాలకు దూరంగా తడిహత్నూర్ మాతంగ్ ఋషి సంస్కార కేంద్రం సంఘం వ్యవస్థాపకులు సూర్యవంశీ పండరి, సంస్కార అధ్యక్షుడు పాండురంగ్ సాగురే అన్నారు. ఆదివారం గాదిగూడ మండలంలోని లోకారి(బి) గ్రామంలో మాతంగ్ సమాజ్ నాయకులతో జన జాగృతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మదొద్దని,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలకు మంచి సంస్కారంతో కూడిన విద్యను అందించాలని, అప్పుడే ప్రయోజకులుగా మారుతారన్నారు. యువత ధ్యానం, యోగ, వ్యాయామం వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, తల్లిదండ్రుల సేవా, పెద్దల పట్ల గౌరవంతో మెలగాలన్నారు. ఈ సమావేశంలో జన జాగృతి సభ్యులు వాగ్మారే వామన్ రావ్, కల్వలె అరవింద్, కాంబ్లె దిగంబర్, చిరంజీవి, విష్ణు, కృష్ణ, భజరంగ్, దత్త, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులున్నారు.

వ్యక్తిగత కారణాలవల్లే రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-ఉట్నూర్



వ్యక్తిగత కారణాలవల్లే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ మొగిలి అన్నారు. ఆదివారం రైతు ఆత్మహత్యపై వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ ఎక్స్ రోడ్డు, సేవాదాస్ నగర్‌కు చెందిన రాథోడ్ గోకుల్ కుటుంబ కలహాలు, మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక విచారణలో తెలిందన్నారు. మృతుడు ఈనెల 12న సాయంత్రం పురుగులమందు తాగి ఇంటి వచ్చి వాంతులు చేసుకోడంతో గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. కొడుకు రాథోడ్ లోకేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి

నవతెలంగాణ-బేల

మండలంలోని రేణిగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవరావు మరణం తీవ్ర మనస్థాపానికి గురిచేసిందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆయన అంత్యక్రియలను స్వగ్రామంలో నిర్వహించగా బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాల్గొని నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రైతు మరణం బాధాకరమన్నారు.

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ భవనాలు

నవతెలంగాణ-బేల

జిల్లాలో అంగన్‌వాడీ భవనాలు లేని ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో భవనాలు నిర్మిస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని సిర్సన్న గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి చేసుకుంటే పిల్లల అసౌకర్యాన్ని దూరం చేసిన వారమవుతామన్నారు. సాధ్యమైనంత త్వరగా అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ భవనమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఇప్పటికే గ్రామానికి నాలుగైదు రోడ్లను గుర్తించడం జరిగిందని తెలిపారు. వచ్చే నాలుగేండ్లలోపు ఆదిలాబాద్ అసెంబ్లీ పరిధిలో రైతులకు సంబంధించిన రోడ్లు పూర్తి చేసే ప్రయత్నం చేస్తామన్నారు. రాజకీయాలకతీతంగా, రాజకీయాలకు సంబంధం లేకుండా అన్ని గ్రామాల సమస్యను పరిష్కారం చేసే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో రైతుల తరపున ప్రతిపాదనలను పంపించడం జరిగిందన్నారు. వీటిపై ప్రభుత్వం కూడా ఆలోచన చేస్తుందని గుర్తుచేశారు. ఆదిలాబాద్‌లోనే కాకుండా నేను ప్రస్తావించిన సమస్య వల్ల రాష్ట్రంలో ఉన్న రైతాంగ సమస్యలు పరిష్కారమయ్యే దిశగా అవకాశం ఉందన్నారు. ఎన్నికల సమయంలో రైతులు పంట చేనులో వెళ్లాలంటే ఎంతో ఇబ్బంది పడుతున్నామని ఈ విషయాన్ని ప్రతిసారి తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, అశోక్ రెడ్డి, నవీన్, నందు, రాము, భూమన్న పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగనున్నాయని సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎం) రాజీలేని ప్రజా పోరాటాలను చేస్తుందన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి అంకితభావంతో పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో పేదల సమస్యలు, భూమిలేని నిరుపేదల హక్కులు, కార్మికుల హక్కులు, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) అనేక ఉద్యమాలు చేసిందన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని ఆర్థిక, సామాజిక అంశాలు, పేదలు, కార్మికులు, మహిళలు, ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పన చేస్తారన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికత, సామాజిక న్యాయం కోసం అంకితంగా పనిచేస్తున్న సీపీఐ(ఎం) మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు డి.పోశెట్టి, తొడసం శంబు, పంద్రం ఆనంద్‌రావు, డాకూరు తిరుపతి, చుంచుల నారాయణ, భూక్యా విలాస్, తొడసం హన్మంతు పాల్గొన్నారు.

ఐచర్ వాహనం బోల్తా

- 15మందికి తీవ్ర, 10 మందికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులను ఉట్నూర్, రిమ్స్‌కు తరలింపు



నవతెలంగాణ-నార్నూర్

ఐచర్ వాహనం బోల్తాపడి 15మందికి తీవ్రగాయాలు కాగా, 10 మందికి స్వల్పగాయాలైన సంఘటన మండలంలోని కొత్తపెల్లి, మల్కుగూడ ఘాట్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుడిహత్నూర్ మండలంలోని సూర్యగూడ గ్రామానికి చెందిన ఆదివాసులు, కెరమెరి మండలంలోని పరందోలి కోటలోని జంగుబాయి దైవ దర్శనానికి వెళుతున్నారు. ఈ క్రమంలో నార్నూర్ మండలంలోని కొత్తపెల్లి, మల్కుగూడ ఘాట్ వద్ద ఐచర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. వాహనంలో సుమారు 50 మందికి పైగా ఉన్నట్టు సమాచారం. సంఘటన జరిగిన విషయాన్ని తెలుసుకున్న స్థానికులు కొత్తపెల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ సుభద్రరామేశ్వర్, సీఐ రహీమ్ పాషా క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఉట్నూర్, జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇలాంటి ప్రమాదం చోటు చేసుకోవడం దురదృష్టకమని, ఎవరికి ప్రాణాపాయం జరగలేదని, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కార్యదర్శి ఆర్కా గోవింద్ రావ్ పేర్కొన్నారు.



సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నూతన పథకాల లబ్ధిదారుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి నూతన పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వే, గ్రామ, వార్డు సభలు, పథకాల అమలుపై అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లతో కలిసి కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికకై జరుగుతున్న క్షేత్రస్థాయి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి తప్పిదాలు జరుగకుండా నిర్దేశిత గడువులోగా సర్వేను పూర్తి చేయాలన్నారు. రోజువారీగా నిర్వహించిన సర్వే వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీఎస్ఓ కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీఆర్డీఓ విజయలక్ష్మి, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

గ్రామసభలకు విస్తృత ఏర్పాటు చేయాలి : కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్ : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని గతంలో నిర్వహించిన ప్రజపాలన గ్రామసభల మాదిరిగానే 21 నుండి చేపట్టే గ్రామ సభలను నిర్వహించాలని, ప్రతీ రోజు ఒక గ్రామ పంచాయతీలో మాత్రమే గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫీల్డ్ వెరిఫికేషన్, గ్రామ సభలపై ఆదివారం గూగుల్ మీట్ నిర్వహించి సంబంధిత అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డ్‌ల లబ్ధిదారుల జాబిత కులగణన (సామాజిక) సర్వే ఆదారంగా తయారు చేసిందని ఇది తుది జాబితా కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకు దరఖాస్తులు కూడా స్వీకరించడం జరుగుతుందన్నారు. గూగుల్ మీట్‌లో ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, సీఈఓ జితేందర్, ఎంఆర్ఓ, డీపీఓ, డీఏఓ, సివిల్ సప్లాయ్, ఎంపీడీఓ, వ్యవసాయ అధికారులు, ఎంపిఓ, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని గిరవెల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్ తో ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి కాలి బూడిదయింది బాధితుడు రైతు మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం తన పంట చేనులో పండిన 40 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిల్వ ఉంచినట్లు బాధితుల పేర్కొన్నారు. దీంతో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తెగి పత్తిలో పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే నిల్వ ఉన్న పత్తిలో నుంచి సుమారు నాలుగు కింటళ్ల పత్తి కాలి బూడిదైందని బాధితుడు పేర్కొన్నాడు. ఆర్థికంగా నష్టపోయిన తనకు ప్రభుత్వం పరిహారం ఇచ్చే ఆదుకోవాలని బాధితుడు కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తిర్యాణీ మండలం ఏదులపాడు గ్రామానికి చెందిన లబ్దిదారులకు ఎమ్మెల్యే కోవలక్ష్మి తన నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి అండగా ఉంటానని తెలిపారు. రాయిసిడాం రమ్యకు అందిస్తున్న రూ.22,000 చెక్కు ఆస్పత్రి ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆమెకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ తిర్యాణీ మండల అధ్యక్షులు హన్మాండ్ల జగదీష్, రాయి సెంటర్ సార్మెడి మడావీ అంబరావు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ సర్పంచ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



నవతెలంగాణ-బెజ్జూర్

ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండేవిఠల్, నాయకులపై కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడం గణపతి, పిసిసి సభ్యులు హర్షద్ హుస్సేన్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇన్‌చార్జి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం కోసం ఎమ్మెల్సీ పని చేస్తుంటే విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుష్పలత, సిర్పూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, నాయకులు యుమ్మరి లింగయ్య, సత్యనారాయణ, సదాశివ్, షణ్ముఖ, సల్మాన్ ఖాన్, మల్లేష్, రమేష్, అశోక్, వెంకటేష్, శేఖర్, ఎర్రయ్య పాల్గొన్నారు.

భీమన్న ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయితీ పరిధిలోని సల్పలగూడ గ్రామంలోని చీకటి భీమన్న ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆదివాసీ మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసులు ఎంతగానో ఆరాధ్యంగా భావించే చీకటి భీమన్న దేవున్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రామస్తులు గ్రామానికి రహదారి మంజూరు చేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవెళ్లడంతో త్వరలోనే రహదారి కోసం నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలిబీన్ అహమద్, మాజీ సర్పంచ్ బూసి భీమేష్, నాయకులు నార ఆషన్న, బాపురావు, బలరాం నాయక్, లక్ష్మణ్, నాయికిని మహేష్, మామిడి శ్రీకాంత్, నెల్లి రవి, నెల్లి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని కొండపల్లి గ్రామంలో బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం గ్రామ దేవత పోచమ్మ ఆలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ పూజారి అశోక్ చారి, దేవర వినోద్, సంతోష్ చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవ సందర్భంగా గ్రామంలో మహిళాలు బోనాలను సమర్పించారు. అనంతరం హోమం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఏర్పాట్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం శిశుమందిర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 16న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు దీనికి ఇప్పటి వరకు 500 మంది పూర్వ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలిపారు. మరింత మంది పెరిగే అవకాశం ఉందని శిశుమందిర్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు చదివిన ప్రతి విద్యార్థి పాలుపంచుకునేలా ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షుడు వాసుదేవన శైలేష్, కార్యదర్శి ఇరుకుల్ల శ్రీనాథ్, సమన్వయ కమిటీ సభ్యులు నాగుల శ్రీనివాస్, శ్రీరాం సత్యనారాయణ, సిద్ధంశెట్టి కృపాల్, ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 20న నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే కార్యక్రమం జరుగుతున్న దృష్ట్యా అధికారులు సర్వే ప్రక్రియలో నిమగ్నమై ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఈనెల 20న జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పథకాలు అర్హులకు అందేలా చూడాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫలాలు జిల్లాలోని అర్హులందరికీ అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి కాగజ్‌నగర్ డివిజన్ తహసీల్దార్లు, మండల వ్యవసాయ శాఖ అధికారులతో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో భాగంగా జిల్లాలో వ్యవసాయ సాగుకు యోగ్యం గల ప్రతి రైతుకు పథకం అందించాలని, సాగుకు యోగ్యం కానీ రాళ్లు, గుట్టలు, నివాస గృహాలు, వెంచర్లు, లే అవుట్లు, అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం సేకరించిన భూములు, ఇరిగేషన్ భూములు, చెరువులు, కాలువలు, రహదారులు, రైల్వే లైన్ల కోసం కేటాయించిన భూములను రైతు భరోసా జాబితా నుండి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితా రూపొందించాలని తెలిపారు. అర్హత గల ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, అధిక ఆదాయం కలిగి అర్హత లేనివారికి రేషన్ కార్డు జారీ చేయొద్దన్నారు. రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలను గ్రామసభలను చదివి వినిపించాలన్నారు. అర్హత గలవారు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చుని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పథకాల వారీగా అధికారులను నియమించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం అక్కడి నుంచి కాగజ్‌నగర్ మండలంలోని ఎన్జీఓస్ కాలనీలో రేషన్ కార్డుల సర్వేను సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పొరపట్లు లేకుండా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



యువత క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్సీ విఠల్



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

యువత క్రీడల్లో రాణించాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో కుమురం భీం స్మారక క్రీడోత్సవాల ముగింపు వేడుకలకు హాజరయ్యారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో భాగంగా ప్రథమ బహుమతి కమ్మర్‌గాం, ద్వితీయ బహుమతి మురళీగూడ, తృతీయ బహుమతి గుంట్లపేట్ గ్రామానికి బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. యువత క్రీడల్లో రాణించాలని, ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపుకు నాంది అని అన్నారు.

హాక సెంటర్ ప్రారంభం

అంతకుముందు మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో హాకా సెంటర్‌ను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఎరువుల గురించి అడిగి తెలుసుకుంటూ రైతులకు నాణ్యమైన వాటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను సబ్సిడీలపై ప్రభుత్వం నుండి అందేలా చూడాలని సెంటర్ యజమాని కృష్ణకు సూచించారు. రైతులకు ఎరువులు ఎల్లవేళల అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, కాంగ్రెస్ నాయకులు సిడాం గణపతి, సముద్రాల రాజన్న, హర్షద్‌హుస్సేన్, సదాశివ్, చంద్రమౌళి పాల్గొన్నారు.



దాడులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు

- ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దేశంలో మహిళలు, విద్యార్థినులపై పెరుగుతున్న హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, అమానవీయ దాడులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ మండలం నజ్రుల్ నగర్‌లోని ఐద్వా మండల కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలులు ముఖ్య అతిథులుగా హజరై మాట్లాడుతూ దేశంలో మహిళలు, విద్యార్థినులపై హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, అమానవీయ దాడులకు పెరుగుతున్నాయని దానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలన్నారు. నిత్యం మహిళా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న ఐద్వా జిల్లా కమిటీకి అభినందించారు. కొన్ని చోట్ల జరిగిన ఘటన దోషులను గుర్తించి శిక్షలు వేయకపోవడం బీజేపీ ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. దేశంలో మతోన్మాద బీజేపీ దాని మూలవేరు అయిన ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు మహిళలకు అత్యంత ప్రమాదకరమని, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాచర్ల వినోద, జిల్లా సహాయక కార్యదర్శి నంది పద్మ, జిల్లా కమిటీ సభ్యురాలు మమతారాణి, కాజల్ బిశ్వాస్ పాల్గొన్నారు.

జిల్లాకు చెందిన ఉపాధ్యాయునికి కవి శ్రేష్ఠ పురస్కారం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకి చెందిన ఉపాధ్యాయుడు, కవి డా.నూతి అభిలాష్ గౌతమీ కవి శ్రేష్ఠ పురస్కారం సొంతం చేసుకున్నారు. తెలుగు ఆంగ్ల భాషలలో అనేక రచనలు చేసిన ఆయన కృషికి గుర్తింపుగా ఆదివారం కరీంనగర్ ఫిల్మ్ భవన్ వేదికగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన శ్రీ గౌతమేశ్వరా సాహితీ కళా సేవా సంస్థ, ఆర్యణీ సకల కళా వేదిక సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కవి శ్రేష్ఠ పురస్కారాన్ని నూతి అభిలాష్‌కు అందచేస్తున్నట్లుగా నిర్వాహకులు డా.దూడపాక శ్రీధర్ తెలియజేశారు. కాగా జిల్లా కళాకారులు, కవులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కవి విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్, స్త్రీ కంట గాయకులు దీక్షితుల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ముగిసిన బర్డ్ వాక్ ఫెస్టివల్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలోని కోసిని డ్యామ్, వెంపల్లిలో ప్రారంభమైన మూడవ బర్డ్ వాక్ ఫేస్టివల్ ఆదివారం ముగిసింది. జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రివాల్, కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సుఖ్‌దేవ్ బోబడే, ప్రకృతి ప్రేమికులు, పక్షి ప్రేమికులు పలు రకాల పక్షులను వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ బర్డ్ వాక్ ఫేస్టివల్ విజయవంతంగా ముగిసిందని, హైదరాబాద్, వరంగల్ నుండి పక్షి ప్రేమికులు పక్షులను వీక్షించారని స్పష్టం చేశారు. పక్షులకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉండడంతో పక్షులు వలస వస్తున్నాయని, రెండు రోజుల్లో దాదాపుగా 100 పక్షుల వరకు వలస వచ్చాయని తెలిపారు. బర్డవాక్ ఫేస్టివల్లో పాల్గొన్నా వారికి సర్టిఫికెట్లు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు రమాదేవి, శేశధర్ బాబు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో విద్యారంగ అభివృద్ధి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. ఉపాధ్యాయ సంఘాలైన పీఆర్టీయూ, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ యూనియన్ క్యాలెండర్లను వేరువేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యారంగం అభివృద్ధి చెందితే జిల్లా దానికదే అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ దిశాగా ఉపాధ్యాయులు తమ బోధనలు చేయాలని, తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠలు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు తౌటం శ్యామ్ సుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కటకం మధుకర్, రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి చిలుకూరి రవీందర్, ఆసిఫాబాద్ అధ్యక్షులు దుర్గం మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యులు దొడ్డిపట్ల రవి కుమార్, కాగజ్‌నగర్ ప్రధాన కార్యదర్శి స్వామి, సిర్పూర్ మండల ప్రధాన కార్యదర్శి గడదాసు గోపి, సులేమాన్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 12 నుంచి మినీ మేడారం జాతర ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను 12 నుంచి 15 వరకు కొనసాగుతుందని ఆలయ అధ్యక్షుడు తుమ్మ రమేష్ తెలిపారు. ఆదివారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద సమావేశం ఏర్పాటు చేసి సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఫిబ్రవరిలో 12, 13, 14, 15 తేదిల్లో జాతర ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో సభ్యులు కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, మంద రాజయ్య, ఆవదూత శ్రీనివాస్, పిరిసింగుల శ్రీనివాస్, దోంతమల్ల వెంకటేష్, కోట శంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవి కాల ప్రణాళికలో భాగంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు కొత్త లైన్ ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్నందున జిల్లా కేంద్రంలోని టీఆర్ నగర్‌లో నేడు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

దాతృత్వం చాటుకున్న మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం

నవతెలంగాణ-కెరమెరి

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని మహిళ గాయపడిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పర్సువాడకు చెందిన ఓ వ్యక్తి భార్యతో కలిసి వార సంతకు వచ్చి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో ఆసిఫాబాద్ వైపు నుంచి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో మహిళ తలకు గాయాలయ్యాయి. సంఘటన స్థలంలో ఉన్న మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం గమనించి మహిళను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి దాతృత్వం చాటుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స అందించేలా వైద్యులకు సూచనలు చేడయంతో పలువురు మాజీ ఎంపీపీని అభినందించారు.

